

ఆదాయం రూ.7 కోట్ల పైమాటే..

విజయనగరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గీతకార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశాక ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తుల నుంచి ప్రభుత్వానికి రూ.7కోట్ల పైమాటే ఆదాయం సమకూరింది. విజయ నగరం జిల్లాలో 16షాపులకు 308 దరఖాస్తులు, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు షాపులకు 60 దరఖాస్తులు అందాయి. కాగా శనివారంతో టెండరు గడువు ముగిసింది. ఈ నెల 10న సోమవారం కలెక్టరేట్‌లో డ్రా ద్వారా మద్యం షాపులను కేటాయించనున్నారు. దరఖాస్తుల సంఖ్యలో విజ యనగరం జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు తెలిపారు.

గిరిజనులతో మమేకమై..

● ఏజెన్సీలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన ● నంద, లొద్ద గ్రామాల్లో ప్రజలతో మాటామంతీ


నడుచుకుంటూ లొద్ద జలపాతం వద్దకు వెళ్తున్న కలెక్టర్

సాలూరు(మక్కువ),ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాలూరు, మక్కువ మండలాల్లో శనివారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆకస్మికంగా పర్యటించారు. ఏజెన్సీలో సంతలు, గిరిజనులు పండించే పంటలు, అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. ఆయా ప్రాంతవాసులతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి పరవశించిపోయారు. తొలుత ఆయన పార్వతీపురం నుంచి మక్కువ మండలం నంద గ్రామానికి చేరుకున్నారు. అక్కడి సంతలో గిరిజనులతో కాసేపు మాట్లాడారు. వ్యాపారులు విక్రయిస్తున్న వస్తువులను పరిశీలిం చారు. ఆ తర్వాత నంద నుంచి సాలూరు మండలం కొదమ పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామం లొద్దకు చేరుకున్నారు. నాలుగు కిలోమీటర్లు కారులో.. ఒక కిలోమీటరు బైక్‌పై .. మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ ఆ ప్రాంతం చేరుకున్నారు. గిరిజనుల జీవనశైలి, ఆహారం, వస్త్రధారణ, పంటలు, తదితర విషయాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లొద్ద వద్ద జలపాతాలను సందర్శించి.. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి.. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు.


గిరిజనులతో మాట్లాడుతూ..

నీరు-చెట్టు

బిల్లులకు మోక్షం

● జిల్లాలో రూ.9 కోట్ల పైబడి బకాయిలు
● చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



పార్వతీపురం, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య జిల్లాలో నీరు-చెట్టు పనులు చేసిన వారికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లించనున్నట్లు స్పష్టం చేసింది. వాస్తవంగా చెరువుల అభివృద్ధిలో భాగంగా గతంలో టీడీపీ సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలు ఈ పనులు చేపట్టారు. అప్పట్లో నామినేషన్ పద్ధతిపై కొన్ని పనులు, ఇరిగేషన్ శాఖ ద్వారా మరికొన్ని చేపట్టారు. అయితే ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. నీరు-చెట్టు పనులు చేపట్టిన వారిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. బిల్లుల చెల్లింపులకు చొరవ చూపలేదు. దీంతో అప్పులు చేసి పనులు చేసిన టీడీపీ సానుభూతిపరులు, కాంట్రాక్టర్లు మరింతగా కుదేలయ్యారు. బకా యిల కోసం వారు అప్పట్లో కార్యాలయాలు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. దీంతో కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ మేరకు న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇరిగేషన్‌శాఖ అప్పట్లో సుమారు రూ.14 కోట్ల వరకు బిల్లులు చెల్లించింది. కోర్టుకు వెళ్లలేని వారికి మాత్రం ఏమీ అందలేదు. అయితే ఇటువంటి వారి సమస్యలను కూటమి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. తక్షణమే బకాయిలను చెల్లించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల పరిధిలో సుమారు రూ.9 కోట్ల మేర పెండింగ్ బిల్లులకు మోక్షం లభించనుంది. కాగా అప్పట్లో ఉమ్మడి జిల్లా పరిధిలో నీరు-చెట్టు పనులు జరగ్గా.. ఇరిగేషన్‌శాఖ ద్వారా కాంట్రాక్టర్లకు త్వరలోనే బిల్లులు చెల్లించనున్నారు. సర్కారు తాజా నిర్ణయంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రక్రియ చేపడతాం..

జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల పరిధిలో నీరు-చెట్టు పనులకు సుమారు రూ.9 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే చెల్లింపు ప్రక్రియ చేపడతాం.

- అప్పలనాయుడు, జిల్లా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి

మనమెంత భద్రం?

● స్ర్కాప్ దుకాణాలు, షా మిల్లుల్లో కానరాని జాగ్రత్త చర్యలు
● కొరవడిన అధికారుల పర్యవేక్షణ..
● యజమానుల్లో అవగాహన లోపం.. మరికొందరిలో అశ్రద్ధ
● భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే పరిస్థితేమిటి?
● ఆ శాఖలో సిబ్బంది కొరత.. పూర్తిస్థాయిలో లేని వాహనాలు
● వేసవిలో అప్రమత్తంగా ఉండాల్సిందే..
● లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు..


జిల్లా కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. తీవ్ర నష్టాన్ని చవిచూడక తప్పదు. అప్ర మత్తంగా లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అయితే శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ స్ర్కాప్ షాపులో జరిగిన భారీ అగ్నిప్రమాదం అందర్నీ కలవరపరు స్తోంది. సుమారు గంట పాటు మంటలు చెలరేగగా.. చుట్టు పక్కల నివాసితులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే భవిష్యత్‌లో భారీ ప్రమాదాలు సంభవిస్తే పరిస్థితేమిటోనని జిల్లాకేంద్రవాసులు భయాందోళన చెందుతున్నారు. అసలు ఇటువంటి ఘటనల విషయంలో తప్పు ఎవరిది? బాధ్యులు ఎవరనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.


స్ర్కాప్ షాపు

ఇదీ పరిస్థితి..

నిబంధనల ప్రకారం స్ర్కాప్ షాపులు, షా మిల్లుల్లో వాటర్ ట్యాంకులు, నీటిని తోడే మోటార్లు ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు అనుగుణంగా తగు పరికరాలను సంబంధిత షాపులు, మిల్లుల యజమానులు ఏర్పాటు చేసుకోవాలి. తమవంతు భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంది. వారు అగ్నిప్రమాద నివారణ పరికాలు ఏర్పాటు చేస్తున్నారా ..? లేదా..? అన్న విషయం సంబంధిత అగ్నిమాపక అధికారులు పరిశీలించాల్సి ఉంది. అదేవిధంగా వారికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ జిల్లాలో అటువంటి పరిస్థితి లేదు. శుక్రవారం రాత్రి పార్వతీపురం పాత బస్టాండ్ సమీపంలోని స్ర్కాప్ షాపుల్లో జరిగిన అగ్ని ప్రమాదమే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. అయితే ఈ విషయంలో సంబంధిత యజమానులది ఎంత తప్పు ఉందో.. అగ్నిమాపక శాఖాధికారులది కూడా అంతే ఉంది. అగ్ని ప్రమాదాల నివారణ, పరికరాల ఏర్పాటుపై అవగాహన కల్పించకపోవడం వల్లే తరచూ ఇటువంటి ఘటనలు సంభవిస్తున్నాయే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.


పార్వతీపురంలోని ఓ షా మిల్లు

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో అగ్నిమాపక శాఖకు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. పార్వతీపురం అగ్నిమాపక కేంద్రంలో తొమ్మిది మంది సిబ్బంది అవసరం కాగా ముగ్గురుతో నెట్టుకొ స్తున్నారు. పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరు అగ్నిమాపక కేంద్రాల్లో 62 మంది సిబ్బంది ఉండాలి.. కానీ 38 మంది మాత్రమే ఉన్నారు. ఆయా చోట్ల 18 మంది హోమ్‌గార్డులు కూడా పనిచేస్తున్నారు. కాగా పార్వతీపురంలో

(మిగతా 8వ పేజీలో...)

డీవార్మింగ్‌డేను విజయవంతం చేయాలి

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని (డీవార్మింగ్‌డే) పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్‌తో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం డీవార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు చిన్నారులు, విద్యార్థులతో తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తర్వాత చిన్నారుల వయసును బట్టి నిర్దేశించిన మోతాదు ప్రకారం ఆ మాత్రలు మింగించాలన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా జిల్లాలో 3,845 కేంద్రాల్లో డీవార్మింగ్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మొత్తంగా 1,96,612 మంది పిల్లలు, విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయించనున్నామని తెలిపారు. ఈ నెల 17న మాప్ అప్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఐవో నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు కె.విజయపార్వతి, పద్మావతి, ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, రఘుకుమార్, వినోద్, శ్రీధర్, డీఎస్‌వో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. వైద్య సేవల్లో నిర్లక్ష్యం!

● 20 నిమిషాల పాటు తల్లీబిడ్డకు అవస్థలు ● ఆ తర్వాత ఆసుపత్రిలో చేరిన వైనం

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో గిరిజన గర్భిణుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. తరచూ గిరిజన గర్భిణులు 108, ఐటీడీఏ అంబులెన్స్‌ల్లో ప్రసవిస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. శనివారం లాడ పెద్దగూడ గిరిశిఖర గ్రామానికి చెందిన ఆరిక సులోచన అనే గర్భిణీకి పురిటినొప్పులు వచ్చాయి. దీంతో భర్త గంగారావు ఐటీడీఏ మెడికల్ సెల్‌కు సమాచారం అందజేశాడు. 20 నిమిషాల తర్వాత ఐటీడీఏ అంబులెన్స్ ఆ గ్రామానికి చేరుకుంది. దీంతో ఆశావర్కర్ సాయంతో గర్భిణిని వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో ప్రసవించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన ఆమెను సీతంపేట ఏరియా ఆసుపత్రికి వెళ్లినా.. సకాలంలో వైద్యసేవలు అందలేదు. సుమారు 20 నిమిషాల వరకు ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది అందుబాటులోకి రాలేదు. దీంతో తల్లీబిడ్డ ఐటీడీఏ అంబులెన్స్‌లోనే చాలా సేపు ఉండిపోయారు. ఆ తర్వాత ఏఎన్ఎం వచ్చి తల్లీ బిడ్డను ఆసుపత్రిలో చేర్పించింది. వాస్తవంగా గిరిజన గర్భిణులను ముందస్తుగా వసతిగృహం, సమీపంలోని పీహెచ్‌సీలకు తరలించాల్సి ఉంది. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజనులు కోరుతున్నారు. 'ఐటీడీఏ అంబులెన్స్‌లో ప్రసవించిన తర్వాత ఏరియా ఆసుపత్రికి వచ్చిన తల్లీబిడ్డకు వైద్య సిబ్బంది సకాలంలోనే వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం వారు క్షేమంగానే ఉన్నారు.' అని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.


ఆసుపత్రికి వెళ్తున్న గర్భిణీ

సందడిగా

చందనోత్సవం



● భారీ ఎత్తున హాజరైన భక్తులు
● మూడు రోజుల పాటు ఉత్సవాలు

6లో

నమో వేంకటేశాయ



● కన్నుల పండువగా.. కల్యాణోత్సవం
● ఘనంగా నూతన ఆలయాల ప్రారంభోత్సవం
● భక్తజన సంద్రంగా తోటపల్లి

6లో

నమో వేంకటేశాయ

- భక్తజన సంద్రంగా తోటపల్లి
- ఘనంగా నూతన ఆలయాల ప్రారంభోత్సవం


కల్యాణానికి హాజరైన భక్తులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల ప్రాంగణం శనివారం భక్తజన సంద్రంగా మారింది. ఈనెల 5వ తేదీ నుంచి విగ్రహాల ప్రతిష్ఠ, నూతన ఆలయాలు ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల తోపాటు భీష్మ ఏకాదశి సందర్భంగా తోటపల్లి భక్తులతో కిటకిటలాడాయి. బ్రహ్మశ్రీ కేవీ నరసింహాచార్యులు, జంధ్యాల జగన్నాథశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యులు, టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి తిరువీధి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థాన ఈవో వీవీ సూర్యనారాయణ, అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డా.డి.పారినాయుడు, కె.శ్రీరామ్మూర్తి, ఎం.పకీరునాయుడు, ఎం.సింహాచలంనాయుడు, శ్రీవారి సేవకులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కల్యాణ మహోత్సవంలో మంగళ సూత్రాలను చూపిస్తున్న రుత్వికులు


ప్రత్యేక వాహనంపై స్వామివారి తిరువీధి

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం..

తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో శనివారం సాయంత్రం పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మాఘశుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవదాయ, ధర్మాదాయశాఖ, తోటపల్లి ఆలయాల అభివృద్ధి సేవా ట్రస్ట్ సంయుక్తంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. పాణిగ్రహణం అనంతరం విశేష హోమాలు, మంగళ శాసనాలతో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి, భాగ్యలక్ష్మి దంపతులు అన్న సమారాధన నిర్వహించారు. మంగళ సూత్రాలను రాజాంకు చెందిన కె.వెంకటశివప్రసాదరావు దంపతులు సమకూర్చారు. అలాగే స్వామివారికి, అమ్మవారికి, రుత్వికులకు దీక్షా వస్త్రాలను పార్వతీపురం పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు అందించారు.

ఉచితంగానే కల్యాణాలు..

దేవస్థానం పరిధిలో ప్రతి ఏటా నిర్వహించే వార్షిక కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తులు ముందుగా రూ.500 చెల్లించేవారు. అయితే ఈ ఏడాది ఈ ఆనవాయితీకి స్వస్తి పలికారు.


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామా సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బెలగాం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భూదేవి, లక్ష్మీ సమేత శ్రీనివాసుడికి అభిషేకాలు, పూలంగి సేవ నిర్వహించారు.


పార్వతీపురం టౌన్: పూజలందుకుంటున్న రమా సత్యనారాయణ స్వామి

కల్యాణ వైభోగమే..

- అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం
- రామనామ స్మరణతో మార్మోగిన రామతీర్థం
- ఉత్సాహంగా ఎదురు సన్నాహం


కల్యాణ వేదికపై స్వామి వార్లు..

నెల్లిమర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శనివారం రాత్రి సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. దేవస్థానం పరిసరాలన్నీ రామనామ స్మరణతో మార్మోగాయి. భక్తులతో ఆవరణ అంతా కళకళలాడింది. పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన కల్యాణ వేదికపై సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చక స్వాములు కల్యాణోత్సవాన్ని ఆరంభించారు. విశ్వక్షేణ పూజతో ఈ తంతు మొదలైంది. కల్యాణ ఘట్టం తిలకించేందుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వందలాది మంది భక్తులు దేవస్థానానికి చేరుకున్నారు. అర్ధరాత్రి రెండున్నర గంటల వరకు కల్యాణం సాగింది. ముందు వధూవరులను వేర్వేరుగా ఊరేగించే ఎదురు సన్నాహ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆనవాయితీగా సీతారామలక్ష్మణులను అశ్వ, గరుడ, హంస వాహనాలపై రామతీర్థం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం పెళ్లి ఘట్టం మొదలైంది. కల్యాణోత్సవాన్ని స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, ఖండవిల్లి కిరణ్, పాణంగిపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్‌కుమార్, రామ్‌గోపాల్ తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

- వరుడు శ్రీరామచంద్రుడి తరఫున


మంత్రికి అర్చకుల ఆశీర్వచనం..


విద్యుత్ వెలుగుల్లో రామతీర్థం ఆలయం

ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు వ్యవహరించాల్సి ఉండగా ఆయన తరఫున దేవస్థానం అధికారులు పాల్గొని శ్రీరామచంద్రునికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వధువు సీతమ్మ తరఫున అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పూసపాటిరేగకు చెందిన ఏకుల రామారావు కుటుంబీకులు హాజరై వివాహ సామగ్రి సమకూర్చారు. సీతమ్మకు బంగారు శతమానాలతో పాటు పండ్లు, పట్టు వస్త్రాలు, అరటి, కొబ్బరి పండ్లు సమకూర్చారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన సీతారాముల తిరుకల్యాణ ఉత్సవాన్ని భక్తులు కనులార్పకుండా చూసి ఆనందించారు. సీతమ్మ తలపై శ్రీరామ చంద్రుడు జీలకర్ర బెల్లం పెట్టిన సన్నివేశం, తలంబ్రాలు చల్లుకున్న సన్నివేశం చూసి పులకించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ నాయకులు గేదెల రాజారావు, లంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఐ జి.రామకృష్ణ పర్యవేక్షణలో నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు


మహిళల కోలాటం..


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కష్టాలు పడి.. కెప్టెన్‌గా వ్యవహరించి

- అంధుల క్రికెట్‌లో రాణిస్తున్న కొప్పరవలస యువకుడు

వంగర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వంగర మండలంలోని కొప్పరవలసకు చెందిన దుర్గారావు అంధుల క్రికెట్‌లో రాణిస్తూ అందరి మన్ననలూ పొందుతున్నాడు. తాజా బెంగళూరులో జరిగిన టీ-20 క్రికెట్ పోటీలకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ సందర్భంగా ఢిల్లీపై జరిగిన మ్యాచ్‌లో చెల రేగిపోయాడు. 42 బంతులకు 78 పరుగులు చేసి ఆంధ్ర జట్టును విజయతీరాలకు చేర్చాడు. బెంగళూరులో ఈనెల 2 నుంచి 7 తేదీ వరకు ఇండస్ లాండ్ బ్యాంక్ నగేష్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. అయితే దుర్గారావు అనేక అష్ట కష్టాలు పడి రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించే స్థాయికి చేరాడు. దుర్గారావు చిన్నతనంలో చూపు కోల్పోయాడు. అంతలోనే తండ్రి కూడా మరణించడంతో తల్లికి భారం కాకూడదని హైదరాబాద్ బంధువులు ఇంటికి చేరాడు. అక్కడ ఓ ప్రైవేటు పాఠశాలలో చేరాడు. క్రికెట్‌పై మక్కువ పెంచుకుని సాధనచేశాడు. అష్టకష్టాలుపడి జాతీయ స్థాయి క్రికెట్‌లో స్థానం సంపాదించాడు. తొలుత 2014లో దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచకప్‌లో ఆడాడు. అప్పట్లో పాకిస్థాన్‌పై అద్భుతమైన బ్యాటింగ్ చేసి రాణించాడు. 2018లో ప్రపంచకప్ భారత్ జట్టు ప్రపంచకప్ సాధించగా, ఆ సమయంలో జట్టు విజయానికి దోహదపడ్డాడు. ఈ ఏడాది ఆంధ్ర జట్టు తరఫున కెప్టెన్ బాధ్యతలు స్వీకరించాడు. పాకిస్తాన్, శ్రీలంకలో జరిగిని టోర్నీలో ఇటీ వలే ప్రతిభ కనబరిచాడు. తాజాగా బెంగళూ రులో జరిగిన టీ 20 మ్యాచ్‌లో సత్తాచాటడంతో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, కొప్పరవలస గ్రామస్థులు అభినందిచారు.



ట్రోఫీతో దుర్గారావు

సందడిగా చందనోత్సవం

- భారీ ఎత్తున హాజరైన భక్తులు
- విదేశాల నుంచీ అనేక మంది శిష్యుల రాక
- మూడు రోజుల పాటు ఉత్సవాలు


బాబా చిత్రపటం ఊరేగింపు

విజయనగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి హజరత్ సయ్యద్ షహీన్ షా బాబా ఖాదర్ వలీ సూఫీ ఉరుసు చందనోత్సవాలు శనివారం సందడిగా మొదలయ్యాయి. బాబా మెట్టలోని దర్గా దర్బార్‌లో మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు వివిధ దేశాలు, రాష్ట్రాలు, జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతున్నారు. ఆయన ప్రియశిష్యులు హజరత్ ఆతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీబాబా, సూఫీ ఆధ్యాత్మిక వారసులు, చీమలపాటు దర్గా పీఠాధిపతి డాక్టర్ మహమ్మద్ ఖ్వాజా మహముద్దీన్ తాజ్‌ఖాదరీ, విజయనగరం దర్గా పీఠాధిపతి ఖలీల్‌బాబు ఉత్సవాలను ప్రారంభించారు. బాబాకు అత్యంత ప్రీతి పాత్రమైన ఫకీర్ కవ్వాళీ, తాసా డప్పుల వాయిద్యాలు తదితర కళా బృందాలతో బాబా దివ్యసమాధికి సుగంధ పరిమళాలు, వివిధ రకాల పుష్పాలతో చాదర్ సమర్పన కార్యక్రమాలు జరిగాయి.

అనంతరం భారీ అన్నదానాన్ని ఖ్వాజా బాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో 850 ఏళ్ల కిందట హజరత్ బాబా ఖ్వాజామెహీద్దీన్ లోకకళ్యాణం కాంక్షించి సూఫీ సంప్రదాయాన్ని తీసుకొచ్చారని, 1900 నుంచి 1961 మధ్య విజయనగరం దర్గాలో ఆధ్యాత్మిక విప్లవం పురుడుపోసుకుందన్నారు. తద్వారా కులమతాలకు అతీతంగా ముస్లిం, ముస్లిమేతరులు అనేక మంది సూఫీ పరంపర వారసులుగా మారారని చెప్పారు. విజయనగరం ఖాదర్‌బాబా దర్గా విశ్వశాంతికి, జాతీయ సమైఖ్యతకు నిలయమని... ప్రేమ,సత్యం, దయా అనే ఆధ్యాత్మిక పునాదితో ఈ పుణ్యక్షేత్రం నిర్మితమయ్యిందన్నారు.


ఉత్సవానికి విచ్చేస్తున్న మహిళలు


దర్గాలో అన్నదానం


దర్గా ఆవరణలో చిన్నారులు, మహిళలు

చాదర్‌ను సమర్పించిన మంత్రి కొండపల్లి..

బాబా ఖాదర్ వలీ సూఫీ ఉరుసు చందనోత్సవాలకు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. దర్గా పీఠాదిపతి ఖలీల్ బాబు, చీమల పాడు పీఠాధిపతి ఖ్వాజా మహముద్దీన్ తాజ్‌ఖాదరీ సాదర స్వాగతం పలికారు. దుస్సాలువతో మంత్రిని సత్కరించారు. అనంతరం ప్రభుత్వం అందించిన పవిత్రచాదర్‌ను బాబావారికి మంత్రి సమర్పించారు. అనంతరం లంగర్‌లో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను మంత్రి శ్రీనివాస్ ప్రారంభించారు.



ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమను ప్రారంభిస్తున్న కొండపల్లి శ్రీనివాస్

పర్యావరణ పరిరక్షణకు సహకారం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పూసపాటిరేగ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ముందుకొచ్చే వారికి సహకరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద గల క్యాంపస్ చాలెంజ్ సంస్థ నిర్మించిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నెదర్లాండ్‌కు చెందిన ఫ్రెండ్స్ ఇన్‌డీడ్, సాయికొరియన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్మించిన ఈ పరిశ్రమ మరికొంతమందికి ఆదర్శం కావాలని కోరారు. పారేసిన ప్లాస్టిక్ నుంచి టైల్స్, ప్రహరీగోడలు తదితర సామగ్రి తయారు చేయడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రిచవచ్చని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం నుంచి కూడా సహకారం అందిస్తామని తెలిపారు. ఇటువంటి యూనిట్లు నెలకొల్పడం కారణంగా పర్యావరణాన్ని కొంతమేర పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, బీజేపీ నెల్లిమర్ల ఇన్‌చార్జి బూర్లె శ్రీధర్, క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, ఫ్రెండ్స్ అండ్ డీడ్ డైరక్టర్ అన్నా లెగ్‌లాండ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు ఆకిరి ప్రసాదరావు, సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

●వినతులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు ● రాజాం ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శనివారం రాజాంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా భూసమస్యలు, కాలువలు, విద్యుత్ సమస్యలపై 80 వినతులు వచ్చాయి. అనంతరం మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు మేరకు ప్రతి శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందజేశారు. రాజాం టౌన్‌కు చెందిన గెంబలి విమలకుమారి కుటుంబానికి రూ.4,01,137, పెనుబాకకు చెందిన చీడి జగన్నాథం కుటుంబానికి రూ.2,63,124, రేగిడి మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన చీడి రాజేష్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు,వంగా వెంకటరావు, శాసపు రమేష్‌కుమార్, దుప్పలపూడి శ్రీను, మరిపి జగన్మోహన్‌రావు, బొత్స వాసుదేవరావునాయుడు, గురవాన నారాయణరావు, పిల్లా సత్యంనాయుడు గ్రంది గోపి, వల్లూరు గణేష్ పాల్గొన్నారు. కాగా అంతికాపల్లిలో మజ్జిగౌరీ అమ్మవారి జాతర పురస్కరించుకుని కోండ్రు మురళీమోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న కోండ్రు మురళీమోహన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

అర్జీలకు తక్షణ పరిష్కారం

● అమ్మవారి జాతర విజయవంతం చేస్తాం ●చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ అందిన అర్జీలను పోర్టల్‌లో నమోదు చేస్తామని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తెలిపారు. వాటికి తక్షణమే పరిష్కారం చూపించడం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. శనివారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూప్రజల సమస్యలు పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని తెలిపారు.నెలలో రెండో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. మార్చి 2,3,4 తేదీల్లో జరిగే అమ్మవారి జాతరను స్థానికులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో విజయవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, ముల్లు రమణ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, రెడ్డి గోవింద్, వెన్నె సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నేడు కథా లోగిలి పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కథాలోగిలి పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నట్లు సహజ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు ఎన్‌కే బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, మేళా మస్తాన్‌రెడ్డి, పుస్తకావిష్కర్తగా గార రంగనాథం, పుస్తకంపై సమీక్షకు రచయిత అల్లి మోహన్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

రేగిడి,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):ప్రతి రైతు కుభూఆధార్ నమోదు తప్పనిసరి అని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఈనెల 25లోగా గ్రామసచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. రేగిడిలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామసచివాలయాల్లో రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం లేక 1బిఅడంగల్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబరుతో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకోవాలని తెలిపారు.

మద్యం షాపులకు 62 దరఖాస్తులు

రాజాం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాజాం సర్కిల్ పరిధిలోని మూడు మద్యం షాపులకు 62 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. గీతకులాలకు కేటాయించిన షాపులకు తొలుత ఈనెల ఐదో తేదీవరకూ చివరి గడువుకాగా, తర్వాత శనివారం వరకు పెంచినట్లు పేర్కొన్నారు. రాజాం మునిసిపాలిటీ, రాజాం రూరల్, సంతకవిటి మండలానికి ఒక్కో షాపు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు.శనివారం నెల్లిమర్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం జీవో- 117 పేరుతో విచ్చిన్నంచేస్తే ఈ ప్రభుత్వం కొన్ని పాఠశాలలను మోడల్ స్కూళ్లగా, మరి కొన్నింటిని ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు త్రినాథ్, మద్దిల రాజు, హరి మోహన్ పాల్గొన్నారు.

విశాఖ ఆర్చ్ బిషప్‌గా బాల

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా బిషప్ ఉడుముల బాలను పోప్ ఫ్రాన్సిస్ నియమించారు. ఈయన ప్రస్తుతం వరంగల్ బిషప్‌గా ఉన్నారు. విశాఖపట్నం ఆర్చ్‌బిషప్‌గా ఉన్న మల్లవరపు ప్రకాష్ గత ఏడాది పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఏలూరు ఆర్చ్ బిషప్ పోలిమేర జయరావు బాధ్యతలు నిర్వహించారు. విశాఖ ఆర్చ్‌బిషప్ పరిధిలో ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఆర్‌సీఎం చర్చిలు, పాఠశాలలు, ఇతర సంస్థలు ఉంటాయి. కాగా తెలంగాణలోని స్టేషన్ ఘనాపూర్‌కు చెందిన బాల 1970 ఫిబ్రవరి 20న ప్రీస్ట్‌గా బాధ్యతలు స్వీకరించారు. రోమ్‌లోని అల్ఫోనియా అకాడమీ నుంచి మోరల్ థియాలజీలో డాక్టరేట్ చేసిన బాల తరువాత హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ రీజనల్ అకాడమీలో ఆచార్యునిగా, రెక్టార్‌గా సేవలు అందించారు. తరువాత బెంగళూరులో కొంతకాలం పనిచేసి, 2013లో వరంగల్ బిషప్‌గా నియమితులయ్యారు.

పోటీతత్వం అవసరం

వంగర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని విద్యా సామాజిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డి రామమూర్తినాయుడు తెలిపారు. శనివారం బాగెమ్మపేటలో భీష్మఏకాదశి పురస్కరించుకుని విద్యాకమిటీ ఆధ్వర్యంలో పతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు విజయ్ కుమార్, వల్లభనాయుడు, శివరావు, మామ హేంరావు, గణపతిరావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో విజయనగరంలో ఆ పార్టీ నాయకులు శనివారం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరశింహం, శివప్రసాద్‌రెడ్డి, గోపలకృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.



విజయనగరం దాసన్నపేట: బాణసంచా కాల్చుతున్న బీజేపీ కార్యకర్తలు

●దత్తిరాజేరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సరిది దుర్గప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.దత్తిరాజేరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పట్ల ఢిల్లీ ప్రజానీకం విశ్వసనీయత చూపి బీజేపీకి అధికారం కట్టబెట్టారని తెలిపారు.

●చీపురుపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆపార్టీ యువ మోర్చా జిల్లా ప్రతినిధి మన్నెపురి శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు చీపురుపల్లిలో ఆ పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచిపెట్టారు.

●రాజాం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):ఢిల్లీలో బీజేపీ విజయంతో రాజాంలో ఆ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు, పట్టణాధ్యక్షుడు జొన్నాడ రంజిత్, గిరిబాబు, గుడివాడ నాగరాజు, రమణనాయుడు పాల్గొన్నారు

కూటమి వైపే ఢిల్లీ ప్రజలు: మంత్రి కొండపల్లి

విజయనగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఢిల్లీ ప్రజలు ఎన్డీఏ కూటమికి ప్రజలు పట్టం కట్టారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్డీఎ కూటమి పాలనపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని, అందుకే ఢిల్లీ ఓటర్లు బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు.చంద్రబాబునాయుడు ప్రచారంచేసిన అన్నిచోట్ల బీజేపీ అభ్యర్థులు గెలిచారని పేర్కొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్



మాట్లాడుతున్న రామన్న

విజయనగరందాసన్నపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీతో పాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, సతీష్ పాల్గొన్నారు.

విలువల కోసం జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

●కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన రవికుమార్



మాట్లాడుతున్న మిడతాన రవికుమార్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జగన్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొనడం, విస్వసనీయత, విలువల గురించి ఆయన మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని జనసేన నాయకుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరక్టరు మిడతాన రవికుమార్ ఎద్దేవాచేశారు. శనివారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాజకీయంగా ఎదుగుతున్నారని, తనపై కక్ష కట్టారని కాంగ్రెస్, టీడీపీ కుట్రతో కేసులు వేసి 16 నెలలు జైలులో పెట్టారని నేడు జగన్ చెప్పడం దారుణమన్నారు. నాడు పెట్టిన కేసుల విషయంపై ఎందుకు విచారణకు హాజరుకావడం లేదని ప్రశ్నించారు. విచారణకు హాజరైతే, జైలుకి పోవల్సి రావడం ఖాయమన్నారు. రాష్ట్రానికి ఆదాయం తగ్గినా షాకులు చెప్పలేదని, ప్రజా సంక్షేమాన్ని, పథకాలను ఏనాడూ ఆపలేదని కూటమి ప్రభుత్వం 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ఉప ముఖ్యమంత్రి పవణ్ కల్యాణ్ గ్రామాల్లో అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. జగన్‌కు విశ్వసనీయత, విలువలపై మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కాళిదాసు, రామునాయుడు, శ్రీను, మోహన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏమార్చి సొమ్ము స్వాహా

●ఏటీఎంల వద్ద సహాయం పేరుతో మోసాలు ●ఇద్దరు నిందితుల అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద సహాయం పేరుతో కార్డుదారులను ఏమార్చి సొమ్ము స్వాహా చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా కేటుగాళ్లకు ప్రకాశంనగర్ పోలీసులు చాకచక్యంగా చెక్ పెట్టారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఏటీఎంల వద్ద మోసాలు ఎక్కువగా జరుగుతుండడంపై ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, క్రైం పార్టీ పీసీలు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘాపెట్టారు. సుమారు 80 సీసీ కెమెరాల విశ్లేషణ అనంతరం ఏటీఎంల వద్ద కార్డు వినియోగించడంపై అవగాహన లేనివారినే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్న విజయనగరం జిల్లా పురిటి పెంటకు చెందిన చల్లమూరి వెంకట భాస్కరరావు, పొన్నాడ కిరణ్‌లను నిందితులుగా గుర్తించారు. వీళ్ల ప్రతి నెలా జీతాల సమయమైన 1 నుంచి 8వ తేదీ వరకూ మాత్రమే.. అదీ జనసమ్మర్థం పెద్దగా ఉండని మధ్యాహ్నం వేళల్లో ఏటీఎం వద్దకు చేరుకుంటారు. ఏటీఎం వినియోగం రానివారి వద్ద మంచి వాళ్లుగా నటిస్తారు. కార్డును స్లాట్‌లో పెట్టి కార్డుదారుడు పిన్‌నెంబరు చెప్పిన తర్వాత డబ్బులు తీస్తున్నట్టు ప్రయత్నిస్తారు. ఏటీఎం పని చేయడం లేదు. డబ్బులు రావడం లేదని చెబుతారు. తిరిగి కార్డుదారుడికి కార్డు ఇచ్చే సమయంలో క్షణాల్లో వేరే కార్డును చేతిలో పెడతారు. అతడు వెళ్లిన వెంటనే పిన్‌నెంబరు అప్పటికే తెలుసు కాబట్టి డబ్బులు డ్రా చేసి ఉడాయిస్తారు. ప్రతి నెలా 8వ తారీఖు తర్వాత ఇంటి వద్దే ఉంటూ కిరాణా కొట్టు నడుపుకుంటారు. దోచుకున్న డబ్బులను వీళ్ల ఆన్‌లైన్‌లో బెట్టింగులకు వాడుకుంటారు. వీళ్లపై ప్రకాశంనగర్ పీఎస్‌లో 3, రాజమహేంద్రవరం 2టౌన్, రాజానగరం, రావులపాలెం, ఏలూరు 3టౌన్‌లో ఒక్కోటి, విజయనగరం, విశాఖ, పెందుర్తి, విజయవాడ, భీమిలిలో 15 కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి 23 ఏటీఎం కార్డులు, రూ.2.06లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ బాజీలాల్ తెలిపారు. ఏటీఎంల వద్ద ఆదమరుపుగా ఉండొద్దని, అపరిచితుల చేతికి కార్డు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. కార్డుదారులకు ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా బ్యాంకు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ బాజీలాల్ బృందాన్ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా.. ఏటీఎం కార్డులను వినియోగించడం చాలా మందికి తెలియదు. చాలా ఏటీఎంల వద్ద సహాయం చేయడానికి కనీసం సెక్యూరిటీ గార్డు కూడా ఉండరు. బ్యాంకు సిబ్బంది సహాయం చేయరు. ఇదే ఆసరాగా మోసాలు జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. ఏటీఎం కార్డులపై కార్డుదారుడి ఫొటో ఉంటే చాలా వరకూ ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

ఎన్ఎంఎంఎస్‌లో నమోదు చేయాలి: ఏపీవో

రేగిడి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):మస్తర్లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని వేతనదారులు, మేట్లకు ఉపాధి ఏపీవో హరనాథ్ సూచించారు. శనివారం అమదాలవలస రెట్ట చెరువులో జరుగుతున్న ఉపాధిపనులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేతనదారుల మస్టర్లలో తేడాలు ఉండకూడదని తెలిపారు. 59 మంది వేతనదారుల మస్తర్ల నిర్వహణపై ఆరాతీశారు. ఒకరికిబదులు మరొకరికి పనికి అనుమతించకూడదని, కొలతల ప్రామాణికంగా పనిచేస్తే వేతనం రూ. 300 గిట్టుబాటు అవుతుందని తెలిపారు.



గంట్యాడ: మురపాకలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బొబ్బిలి రూరల్: పిరిడి రామాలయంలో భజన చేస్తున్న సభ్యులు

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి

● తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు

జిల్లాలో భీష్మ ఏకాదశిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలతోపాటు, భజనలు నిర్వహించారు.

●గంట్యాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):మురపాకలో రామాలయం వద్ద భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. ఆదివారం కూడా పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

●మెరకముడిదాం,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): భైరిపురం వేంకటేశ్వరాలయంలో పూజారి శ్రీధర ఆచార్యులు పూజలు నిర్వహించారు.

●రేగిడి, ఫిబ్రవరి 8: మండలంలోని తాటిపాడులో అన్నమ్మ పేరంటాలకు బోనాలు, పసుపుకుంకాలు, మంగళసూత్రాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ధర్మకర్త గాదం గోవిందరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో బాబురావునాయుడు, రామినాయుడు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):పిరిడిలోని పోల వీధిలో గల రామ మందిరంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ దూపం వాసు ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సాలూరు(పాచిపెంట), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగు మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాచిపెంట మండలంలోని కర్రివలస గ్రామానికి చెందిన దాసరి శంకరరావు(35) నిత్యం మద్యం తాగుతూ ఉంటాడు. దీంతో ఆరోగ్యం పాడవడంతోపాటు డబ్బులు ఖర్చు అయిపోతున్నాయని భార్య హైమ మందలించింది. దీంతో మనస్తాపంచెంది మద్యంమత్తులో పొలానికి వెళ్లి పురుగు మందుతాగాడు. విషయం తెలుసుకున్న భార్య సాలూరు పీహెచ్‌సీకి తరలించింది. అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సీ కృపారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

విజయనగరంక్రైం,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):మెరకముడిదాం మండలంలోని రావివలసలో మద్యం విక్రయిస్తున్న రెడ్డిసూర్యనారాయణను అదుపులోకి తీసుకుని 12 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో తదుపరి చర్యల కోసం చీపురుపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, జనార్దన్, భారతీ పాల్గొన్నారు.

●భోగాపురం, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలం రాజాపులోవలో బెల్ట్ దుకాణంపై దాడిచేసి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టుచేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.రవికుమార్ శనివారం రాత్రి తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో మూడునెలల్లో 45 అనధికార మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసి 475 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎన్.సురేష్, హెచ్‌సీ రామారావు పాల్గొన్నారు.

●రాజాం,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి):మండలంలోని పొగిరిలో మద్యం అమ్ముతున్న ముగ్గురుని శనివారం అరెస్ట్‌చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. వారివద్ద నుంచి 31మద్యం సీసాలను సీజ్‌చేసి వారిపై కేసునమోదు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ సిబ్బంది ఉన్నారు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

గజపతినగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవరి ఎక్సైజ్ సీఐ జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.గతడిసెంబర్ నుంచి ఇప్పటివరకు 47మంది బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమెదు చేసి 102.6లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.తహసీల్దార్ కార్యాలయంలో 37 మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు తెలిపారు.

విజయనగరంలో మహిళ అదృశ్యం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.శ్రీనివాస్ కథనం మేరకు.. గరివిడికి చెందిన వెంకట జానకిరామరాజు కుమార్తె డి.సాయిసుక్రిత ఇంటి నుంచి బయలు దేరి శనివారం విజయనగరం వచ్చింది. పనిముగించుకుని ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి విశాఖ వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారంఇచ్చింది. చీకటిపడిన వరకూ ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అదేసమయంలో బంధువులు,స్నేహితుల వద్ద వాకాబుచేశారు. ఆచూకీ లేకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమెదుచేశారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

గరివిడి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దాని సాధనకు కృషి చేయాలని ఎస్ఐ లోకేశ్వరరావు కోరారు.శనివారం గరివిడిలోని కళాశాలల్లో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సంకల్పరథంతో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై లఘు చిత్రాలు, వీడియోలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.

మనమెంత భద్రం?

(ఐదో పేజీ తరువాయి)

అగ్నిమాపక కేంద్రానికి ఒక ఫైర్ ఇంజిన్ మాత్రమే ఉంది. మరో వైపు అరకొర సిబ్బంది ఉండడంతో.. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలను అదుపు చేయడం కష్టతరమవుతోంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తాం..

స్క్రాప్ షాపులు, షా మిల్లుల్లో అగ్నిప్రమాదాల నివారణ, పరికరాల ఏర్పాటుపై సంబంధిత యజమానులకు అవగాహన కల్పిస్తాం. జిల్లాలోని నాలుగు అగ్నిమాపక కేంద్రాల్లో అదనపు వాహనాలు ఏర్పాటుపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు. సిబ్బంది నియామకం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

- శ్రీనుబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి

మన్యం బంద్‌ను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అవగాహనా రాహిత్య వాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణారావు, గిరిజన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకర్, పత్తిక లక్ష్మయ్య, బిడ్డిక రామ్మూర్తి, నిమ్మక రాజశేఖర్, పువ్వల ప్రసాద్, నిమ్మక ప్రశాంత్, కోలక కొండలరావు, నిమ్మక మోహన్‌రావు, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కురుపాం, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశాంతంగా హిందీ పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో కురుపాం హిందీ పరీక్ష కేంద్రం వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. విశారద పరీక్ష, భూషన్, విద్వాన్, మొదలైన పరీక్షకు 62 మంది గాను 46 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పాఠశాల హెచ్ఎం టి.శంకరరావు, డిపార్ట్‌మెంట్ ఆఫీసరుగా ఎంఈవో ఎస్.సత్యనారాయణ వ్యవహరించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం..

కురుపాం, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కురుపాంలో స్థానిక వైరిచర్ల కిషోర్‌చంద్రదేవ్ డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ముందు ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఉన్న భయం, ఆందోళన పోతుందని తెలిపారు. ఈ పరీక్షకు సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

రహదారి పనులు పక్కాగా చేపట్టాలి

భామిని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏబీ రోడ్డు నుంచి గిరిజన గ్రామాలకు ఎట్టకేలకు మోక్షం కలుగుతుంది. ఏబీ రోడ్డు నుంచి ఇసుకగూడ రూ.కోటి, మూలగూడ రూ.1.8 కోట్లతో బీటీ రోడ్లు మంజూరు కావడం ఆదివాసీ గిరిజ నులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారుల పనులను పంచాయతీ రాజ్ ఈఈ బి.రవి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్ ఏతఃఈ భాస్కర రావును పలు సూచనలు చేశారు. పనులపై అణవణువు పర్యవేక్షించి పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కాట్రగడ, పసుకుడి, సింగిడి మంజూరు అయిన సీసీ రోడ్డులో క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కోరారు. భామిని, వడ్డంగి డ్రైనేజీ పనులు పర్యవేక్షించాలని సిబ్బందిని సూచించారు.

హెల్మెట్ తప్పనిసరి



సీతానగరం: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

సీతానగరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసిన ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. శనివారం హనుమాన్ కూడలి వద్ద వాహన చోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దన్నారు.

● సీతంపేట రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రహదారి భద్రత పాటించాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ సమీపంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించకూడదని అన్నారు. ఏఎస్ఐ సంజీవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళరాయ సాగర్ పనులు పూర్తి చేయరా?

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల పరిధిలో ఉన్న వెంగళరాయి సాగర్ ఆదనపు ఆయకట్టు రైతుల పాలిట 'బెంగ'లరాయ ప్రాజెక్టుగా మారిందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు ఆరోపించారు. కలవరాయి పంచాయతీ వాకాడవలస గ్రామ సమీపంలో గల వెంగళరాయ సాగర్ ఆదనపు ఆయకట్టు కాలువ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వెంగళరాయ సాగర్ అదనపు ఆయకట్టు పనులు ప్రారంభించి పుష్కర కాలం అవుతున్నా నేటికీ పూర్తి కాకపోవడం విడ్డూరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఈ పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు.

అనుమతి లేకుండా పశువులు వధిస్తే చర్యలు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): విజయనగరంలో ట్రేడ్ లైసెన్స్ అను మతి లేకుండా పశువులను వధించినా, రవా ణా చేసినా చట్టప్రకారం నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల పసుమాంస విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టం ప్రకారం పశువులను అక్రమంగా రవాణా చేసినా, వాటిన వధించి మాంసం విక్రయించి నా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా పాఠశాలను ఊరిలోనే ఉంచాలి

● ఆందోళన చేస్తున్న దశమంతపురం వాసులు



దశమంతపురం ప్రాథమికోన్నత పాఠశాల

వీరఘట్టం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దశమంతపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల.. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాలను వేరే గ్రామంలోని పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. అయితే 6, 7, 8 తరగతులను వేరే పాఠశాలకు తరలించి, ప్రస్తుత పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. కానీ ఈ గ్రామానికి దగ్గరలో సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు లేవు. విద్యార్థులు వీరఘట్టం గానీ సంత నర్సిపురం గానీ వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 32 మంది విద్యార్థులు, ఆరు నుంచి 8 తరగతి వరకు 38 మంది విద్యార్థులు చదువు తున్నారు. వీరు వేరే గ్రామానికి చదువుకోవడానికి వెళ్లాలంటే గెడ్డ దాటాల్సి ఉంటుంది. అలాగే గ్రామం నుంచి సరైన రవాణా సౌకర్యాలు కూడా లేవు. అందువల్ల గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 1923లో నిర్మించిన ఈ పాఠశాలకు 2023 లో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

దూర ప్రాంతం వెళ్లి చదవలేం

మా గ్రామానికి దగ్గరలో పాఠశాలలు లేవు. అందువల్ల దూరం ప్రాంతానికి వెళ్లి చదువుకోలేం. మా పాఠశాలను ఎప్పటిలాగే కొనసాగించండి

- కె.దినేష్, ఏడో తరగతి విద్యార్థి, దశమంతపురం

వర్షాకాలంలో ఇబ్బంది

వర్షాకాలం వచ్చిందంటే మా ఊరి నుంచి వేరే ఊరు వెళ్లడానికి ఇబ్బంది పడాల్సి ఉంటుంది. గెడ్డ దాటాల్సి ఉంటుంది. విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని మా గ్రామంలోని పాఠశాలను కొనసాగించాలి.

- రామదాసు శారద, పాఠశాల కమిటీ ఛైర్మన్

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు

● ఆలయాలకు బారులు తీరిన భక్తులు

భీష్మ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచే ఆలయాల వద్ద క్యూ కట్టారు. సత్యనారాయణ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూలంగి సేవ నిర్వహించారు. పలు చోట్ల ఏకాహం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భామిని: పసుకుడిలో నృత్యం చేస్తున్న చిన్నారులు



పార్వతీపురంటౌన్: సత్యనారాయణ స్వామి ఆలయంలో..



వీరఘట్టం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో శనివారం పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలు కలిగిఉన్నా, రవాణాచేసినా, విక్రయించినా, పండించినా, దళారులుగా వ్యవహరించినా, చట్ట రీత్యా తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరం కావాలని, కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు సంకల్పం కార్యక్రమంతో జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలు, యువత, విద్యార్థులకు వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించి వాటి పట్ల ఆకర్శితులు కాకుండా చర్యలు చేప డుతున్నామని పేర్కొన్నారు. ఈమేరకు జిల్లావ్యాప్తంగా పలు ఇంజనీరింగు, మెడి కల్, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.పవర్ ప్రజెంటేషన్‌ను, లఘు చిత్రాలను ప్రదర్శించి మత్తుపదార్థాలకు బానిసలుగా ఏ విధంగా మారుతున్నారు, అవసరానికి డబ్బులు అందక నేరాలకు పాల్పడడం, క్రిమినల్ కేసుల్లో ఏ విధంగా నిందితులుగా మారుతురో విద్యార్థులకు యువతకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నామని పేర్కొన్నారు.

చిత్రం గీసి.. బహూకరించి



విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంకు చిత్రాన్ని అందిస్తున్న శ్రీనివాసరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి దేవస్థానంలో నిర్వహిస్తున్న విగ్రహాల ప్రతిష్ఠకు హాజరైన రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంకు శనివారం దేవస్థానం ఆవరణలో ఆయన చిత్రపటాన్ని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రుగడ శ్రీనివాసరావు అందించారు. ఈ సందర్భంగా పెన్సిల్‌లో చిత్రీకరించిన చిత్రాన్ని చూసి సుబ్రహ్మణ్యం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావును అభినందించారు.

బీపీఎల్ టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని రాజా కళాశాల మైదానంలో శనివారం బొబ్బిలి ప్రీమి యర్ లీగ్(బీపీఎల్)2- టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభ మయ్యాయి. ఈ పోటీల్లో ఉత్త రాంధ్ర జిల్లాలతో పాటు రాయగడ నుంచి సుమా రు 16 జట్లు పాల్గొన్నాయి. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. గరివిడి జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. లోకబంధు విద్యా సంస్థల అధినేత తూముల కార్తీక్ బ్యాటింగ్ చేయగా బేబీనాయన బ్యాటింగ్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈనెల 25 వరకు పోటీలు నిర్వహిస్తామని, ఆఖరి రోజున విజేతలకు బహుమతులను అందజేస్తామని నిర్వాహకు డు బొత్స అప్పులు ప్రకటించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాం

ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బొబ్బిలిలో సకల హంగులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామ ని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, రాంబార్కి శరత్‌బాబు, ఆభ్యుదయ పాఠశాల ప్రిన్సిపాల్ డా.చింతా శారద, పోటీల నిర్వాహకులు పి.గణేశ్, రమేష్, సందీప్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ర్యాలీ



ఉల్లిభద్రలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లిభద్ర గ్రామంలో శనివారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ వై.బలరాంనా యుడు మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు సమీప ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ ప్రారంభోత్సవం



రామాలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని తారకరామాకాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి సుబ్రహ్మణ్యస్వామి కోదండ రామాలయ ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాశీ నుంచి తెప్పించిన విగ్రహాలకు ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడులు స్వామివారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.

అసంపూర్తి నిర్మాణానికి ప్రహరీ

● శ్లాబు స్థాయిలో గిజబ అంగన్‌వాడీ భవనం

● ఐదేళ్లగా పూర్తి చేయని వైనం



పిచ్చిమొక్కల మధ్య గిజబ అంగన్‌వాడీ భవన నిర్మాణం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిజబ పునరావాస గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనానికి ప్రహరీ మంజూరయ్యింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవనాన్ని శ్లాబు వరకు నిర్మించారు. వైసీపీ హయాంలో గత ఐదేళ్లలో ఈ భవనంపై ఎవరూ దృష్టి సారించలేదన్నారు. దీంతో ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అయితే ప్రస్తుతం ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండానే ప్రహరీకి రూ.9.30లక్షలు మంజూరు చేశారు. ఓ పక్క సరైన కేంద్రం లేక చిన్నారులు అద్దె భవనంలోనే ఉంటున్నారు. ముందు భవనాన్ని పూర్తి చేసి, ప్రహరీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కేంద్రాన్ని పూర్తి చేసి ప్రహరీ నిర్మించండి

గిజబ గ్రామంలో అసంపూర్తి అంగన్‌వాడీ నిర్మాణానికి ప్రహరీ ఎలా మంజూరు చేశారో అర్థం కావడం లేదు. కేంద్రాన్ని పూర్తి చేసి తర్వాత ప్రహరీ నిర్మించాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదు.

- మండల భాగ్యలక్ష్మి, సర్పంచ్, గిజబ గ్రామం

మూతపడిన పాఠశాలకు..

మరుపెంట పంచాయతీ తులసిరామినాయుడువలసలో గతంలో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించారు. అయితే విద్యార్థులు లేకపోవడంతో మూతపడింది. గ్రామ పరిధిలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రస్తుతం ఈ పాఠశాలలోనే నిర్వహిస్తున్నారు. ఈ మినీ కేంద్రంలో కనీసం ఐదుగురు చిన్నారులు కూడా లేరు. అయితే ఈ భవనానికి కూడా ప్రహరీ నిర్మాణానికి రూ.7.20 లక్షలు మంజూరు చేశారు. ఏ ప్రాధాన్యతలో మంజూరు చేశారో అర్థం కాని విధంగా ఉందని పలువురు తలలు పట్టుకుంటున్నారు.



తులసిరామినాయుడు వలసలో మూతపడిన పాఠశాలలో మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

10న డీ వార్మింగ్ డే

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఈనెల 10న డీ వార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు తాడికొండ పీహెచ్‌సీ వైద్యుడు బుద్దేశ్వరరావు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొంటారని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శశిభూషణరావు

పాలకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వి.శశిభూషణరావును ఎన్నుకున్నారు. విజయవాడలో శనివారం రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన వి.శశిభూషణరావు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జీడిపప్పు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సిరికొండ గ్రామ సమీపంలో జీడిపప్పు ఫ్యాక్టరీ నిర్మాణానికి నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు దంపతులు శనివారం భూమి పూజ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఎటువంటి కాలుష్యం లేకుండా పాలకొండలో నాణ్యమైన జీడిపప్పు అందించాలని ఆలోచన ఉందన్నారు.

పారిశుధ్య సేవలు మెరుగుపర్చండి

సాలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'మంత్రి చెప్పినా కలెక్టర్ ఆదేశించినా బేఖాతర్' అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యో తిలో ప్రచురితమైన కథనానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందించారు. సాలూరు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. 25వ వార్డు బంగారమ్మపేట తో పాటు పట్టణంలో ఉన్న 29 వార్డుల్లో శానిటేషన్ మెరుగు పరచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఉపేక్షించే సమస్యే లేదన్నారు. అన్ని వార్డుల్లోని కాలువలను తక్షణం శుభ్రపరచా లన్నారు. అలాగే పట్టణంలో చెత్త కనిపించకుండా పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు. తక్షణం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని నియమించాలన్నారు.

ఘనంగా దేవుడుబాబు యాత్ర

రామభద్రపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కొండకెంగువ గ్రామంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా దేవుడుబాబు యాత్ర ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఈ యాత్రలో పాల్గొన్నారు. పూజలు నిర్వహిం చారు. అనంతరం అందరితో పాటు క్యూలైన్‌లో నిలబడి ప్రసాదం స్వీకరించారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.